


౧

నేనొకరోజు సాయంకాలము కాలేజీనుంచి యింటి కొచ్చేసరికి మాఅమ్మ చాలా కోపంతో యిలా వుపక్రమించింది:—

"వొరే—శంకరం! నే నిహమీ అత్తవారింటి కెళ్లినట్టయిన చెప్పొచ్చు కోట్టు. ఈమాటుతో బుద్ధొచ్చింది నాకు. వాళ్లు నాకు చేసిన అవుమానానికి నాజన్మంలో యిహ వాళ్ల గుమ్మం తొక్కమనుందా?"

"యేం! యేం జరిగిందేఁవిటి?"

"వొహమాట కాదు—వొహపలు కాదు. అడ్డమైనమాటలూ అన్నారు!"

"యేఁవన్నా రమ్మా?"

"నన్ను వాళ్లేఁవన్నా నీ కిష్టమే గా!"

"నా కిష్టఁవేఁవిటి! బాగానే వుంది! అయినా సంగతేఁవిటో చెప్పు—విసిగించక."

"చెప్పకేం! అంతా చెబుతాను—విను. పట్టుకెళ్లిన సారెలూ, చీరలూ అన్నీ యిచ్చాను. అవ్వింకా వాళ్లకి చాల్లేదు కాబోలు—మొహాలు ముణుచుకు పోయినాయి. బంతీ గింతీ అయ్యేదాకా యెల్లాగో నోరు మూసుకు నేకూచున్నా. ఆతర్వాత నావల్లొచ్చిన తప్పల్లా యిది: 'ఎప్పుడు పంపిస్తారు—పిల్లను?' అని అడిగాను. ఆమాట నే నడిగేసరికి మీద పడి బరికేసింది—మీఅత్తగారు! వాళ్లన్నమాట లన్నీ నే నేం చెప్పగలనా, యేడవగలనా? 'యీరోజుల్లో అసలు పెళ్లే పదహారేళ్లొచ్చేదాకా చెయ్యకూడ దంటూంటే, యీపిల్ల కింకా వడసారం పదహారేళ్లయినా నిండలేదుగదా, అప్పుడే పంపుమ న్నల్లా అడిగారండీ!' అని నలుగురూ నాలుగు మూల్లా దుయ్యబట్టుకు నేటప్పటికి నాకు గజగజా వొణు కొచ్చింది! ఆమాత్రంమాట అడగటానికి నాకు స్వతంత్రం లేదూ?"

"అయినా అప్పుడే యెందు కడిగావు ఆమాట?"


"అడక్కపోతే అల్లా వొదిలెయ్యమంటావా యేమిటి? నీపెళ్లాన్ని యిస్కూలుఫైనలుతోనైనా మాన్పించరట! యింకా రెండేళ్లయినా చదివించాలిట! ఆడపిల్ల నల్లా చదివిస్తే యెందుకైనా పనికొస్తుందా! మొగాళ్లల్లో కలిసి గాడిదలాగు ఆడదానికి చదు వేమిటి—అసహ్యం? అయినా నా కెందుకు లే—నీకిహ అంటచిప్పలు తోమేరాతే పడుతుంది. నీచే తెల్లాగా తోమిస్తుం దాపిల్ల. ఆమాటా అనేసినట్టే. నీచదు వంతకంతకు అడుగంటుతోందని కూడా అంది—మీ అత్తగారు."

"చదువుకుంటే తప్పే ముంది?"

"ఇంకా చదు వెందుకూ—యీవిడికి? యిక్కడి కొచ్చినతర్వాతకూడా పుస్తకం పట్టుకూచుంటే-

నాకు పనికిరాదుసుమీ. అయినా నావెఱ్ఱి కాని, అక్క రమ్మకొచ్చినపిల్ల అణిగిమణిగుండదని మీనాన్న మొదటినుంచీ చెబుతూనేవున్నారు."

"చెప్పటమే కాదు—చదువు మాన్పించుమని నోటీసుకూడా యిచ్చాడుగా! అయినా చదువుకోటం మొదటినుంచీ నా కిష్టంవేనమ్మా!"



"ఓరి నీబుద్ధి బుగ్గయిపోనూ! 'వినాశకాలే విపరీతబుద్ధీ' అన్నట్టు నీ కిల్లా పుట్టిందేమిరా? 'అన్నపూర్ణమ్మకోడలింకా చదువుతోందిట!' అని లోకులు అడ్డమైనపేర్లూ పెడుతున్నారు; అంచేత చెప్పాను. లేకపోతే నా కెందుకు? మీ రేగంగలో దిగినా సరే?"

"ఎవళ్ళో పేర్లు పెడతారని బెదిరి, చెయ్యవలసిన పనులు మానుకుంటే మనుష్యజన్మెత్తిన సార్థక మేముంది? ఇరవై మూడేళ్ళొచ్చి యీ అబ్బాయి యింకా బియ్యేలోనే కూచున్నా డేమని అనేకమంది నవ్వుతున్నారు. లోకు లాక్షేపిస్తున్నారు గా!—యికనుంచి నేనూ మానేస్తాను."

"చదవేస్తే వున్నమతీ పోయిందన్నట్టుంది. ఆడవాళ్ళకీ నీకూ సాపత్య మేమిటి? చదువు మానేస్తే నువ్వెందుకైనా పనికొస్తావా?"

"చదువు మానేస్తే మే మెలా పనికిరామో వాళ్ళూ అలాగే పనికిరారు. వీ ళ్ళెన్నిసార్లు ఫేలైనా పిలక్కి తాడ్కోసి పైకి లాగాలీ! వా ళ్ళెంత తెలివైనవాళ్ళయినా కింది కణగతొక్కాలీ?"

"ఆడదానికి చదువుకుంటే యెల్లా జరుగుతుంది యింట్లో?"

"మనకి మింగటానికి మెతుకు రాదని వాళ్ళని పశుప్రాయుల్ని చెయ్యమంటావా? రానురాను దేశ మింతఅధోగతి పాలవుతూందేం?"

"అధోగతీ వద్దు—యేమీ వద్దు. మాటలు మాత్రం తిన్నగా రానియ్యి. నీకూ నాకూ యేమీ సమ్మంధం లేదు. నాతో యేమీ చెప్పకు. యీరోజునుంచి నీమొదట నే నిహ కూచుంటే వొట్టు!"

౨

"కమలా! షికా రెళ్దా మొస్తావా?"

"అలాగే — అయిదు నిముషాల్లో వస్తా" నంటూ లోపలి కెళ్ళింది.

"కోచిమెన్ బండి సిద్ధంచేశాడు. త్వరగా రా."

"నాఆలస్య మేమీ లేదు. ఇదుగో వస్తున్నా" నంటూ సావిట్లో కొచ్చింది.

"కమలా!" అని పిలుస్తూ మాఅమ్మకూడా సావిట్లో కొచ్చింది.

కమ—ఆఁ— యెందుకండీ?

అన్న—మొగాళ్లు మసిలే సావిడిగదా, నువ్వు సావిడిగుమ్మంలో నుంచున్నా వెందుకూ?

కమ—షికారు రమ్మన్నారు. నాకు తెలియక నుంచున్నాను. పోనీ, దొడ్డిగుమ్మన్నుంచే వెళతానులెండి.

అన్న—అంతా వేళాకోళం, వెక్కిరింతలూగా వుందే! యిందుకా, యీవేషమంతాను? యెక్కడి కెళతావు?

కమ—చల్లగాల్లో కొంచెం అలా వెళ్లొద్దామని. అయినా వేషమేఁవీ లేదే, మామూలువేషమే.

అన్న—యేం లేమా? కన్ను మూసి గంత కడతావా యేమిటి? తురకదానిలాగా కాళ్లకి జోడేమిటి?

కమ—వీథిలో తిరిగేటప్పుడు కాళ్లకి జోడు లేందే నాన్నగారు తిరగనివ్వరు.

అన్న—నడిచికూడా వెళతావా యేమిటి?

కమ—నడిచి కాదమ్మా, బండీ యెక్కే; యెక్కడైనా దిగితే కాలికి జోడుంటుంది. దానిలో తప్పేముంది?"

అన్న—యేం అబ్బురంగా వుందీ? జోడు తొడుక్కుని ప్రయాణమైన ఆడదాన్ని నే నెక్కడా చూడలేదు. నేటికాలాని కీదొరసాని కనపడింది!

కమ—ఆడవాళ్లకాళ్లని చర్మంతో చెయ్యలేదా భగవంతుడు? యేం గుచ్చుకున్నా వట్టికాళ్లతో నడవ్వలసిందే? మొగవాళ్లెన్నడైనా జోడు లేందే గుమ్మం కదులుతారా?

అన్న—ఓ యబ్బో! మే మంతా జోడుతోనే నడిచామా యేమిటి? నాలాంటిదానవు కావూ నువ్వు? నాకాళ్లు చూడూ—యెల్లా పగిలాయో!

కమ—మీరూ తొడుక్కోండి.

అన్న—నువ్వు చాలక నేనుకూడా తొడుక్కోవాలి—సిగ్గు లేక; మరీ వీథిని బడితే నలుగురూ నవ్వుతారు. పద్దెనిమిదేళ్లు వొంటిమీదికొచ్చిన నీకు తెలియక్కర్లా! అవతల అత్తగారూ, మామగారూ వున్నారనైనా చూడకుండా షికారు కెళ్లా బయల్దేరావు?

కమ—అస్తమానం గాలి లేకుండా యింట్లో కూర్చుంటే ఆరోగ్యం చెడిపోతుంది. సగంముప్పాతిక మొగవాళ్లకంటే ఆడవాళ్లు బలహీనంగా వుండటాని కిదే కారణం. అయినా నా కిది కొత్త కాదే—చాలా రోజులునుంచి వెళుతున్నాను.

అన్న—అయితే, యిప్పుడే ననుకున్నా!—యిదివరకే ముదిరిం దన్నమాట—పాకం. యిన్నాళ్లనుంచీ వెళుతుండబట్టేనా యింతబలంగా వుంట? నాకున్న బలంలో నీకు నూరోవం తుందా?

కమ—బాగానే వుంది, లాజిక్కు (logic)! నాశరీరానికి చల్లగాలి తగలకపోతే అసలు వీల్లేదు, యింతకంటె పాడవుతాను. యేదో స్కూల్లో వుండి వుండొచ్చి కాస్సేపైనా షికా రెళ్లకపోతే ఆరోగ్యం చెడిపోదూ? స్కూలు కెళ్లనివాళ్లుమాత్రం అస్తమానం గాలిలేని యిళ్లల్లో కూర్చుంటే మసీదులో యెలకల్లాగ మగ్గిపోరూ?

అన్న—బలం లేనిదానవు, ఆచదువు చదువుమని యెవ డేడిచాడు? చదవడ మెందుకు? బలంకోసం అని పేరెట్టి వీథులమ్మట షికా ర్లెందుకు—సిగ్గు లేక? మే మంతా యేమంత మగ్గుతున్నాం? విసినికఱ్ఱతో విసురుకుంటే సరి, మాచక్కా వస్తుంది గాలి.

కమ—విసనకఱ్ఱగాలి మనుష్యుల కేమీ ఉపయోగించదు. బలం కొన్నాళ్లక్కాకపోతే కొన్నాళ్లకైనా వస్తుంది. వయస్సు మీరితే చదు వెల్లా వస్తుంది?

అన్న—మళ్లీ ఆమాటే మాట్లాడుతావు! అసలు నిన్ను చదవమన్నవా రెవరంట?—ముందు నా కది చెప్పూ.

కమ—ఎవరో చెప్పడ మెందుకు! శరీరము వృద్ధిపొందడానికి అన్న మెలా తింటారో బుద్ధి వికసించడానికి చదు వలాగే చదువుకుంటారు. భోజనం చెయ్యటాని కెవరిపర్మిషనైనా పొందుతున్నారా? 'విద్య నిగూఢగుప్తమగు విత్తము'; దానివల్ల యెప్పటికైనా లాభమే గాని నష్టం లేదు.

అన్న—ఆఁ! యేమిటి! మాటలు నేర్చిన కుక్కను వేటకి పంపిస్తే యిసుకో అంటే యిస్కో

అందిటు. అల్లా వుంది నీవరస. అన్నం తినకపోతే చచ్చిపోతారు. చదువుకోకపోతే యేమైపోతారు?


కమ—ఏమీ అయిపోరు—జ్ఞానంమాత్రం నశిస్తుంది.

అన్న—నీపాటిఆలోచన లేకేనా మునపటివాళ్లు చదువుకోంది? వాళ్ల కేం జ్ఞానం తక్కువైంది?

కమ—పూర్వకాలంలో అంతఃపురాల్లో వుండే క్షత్రియస్త్రీలుకూడా చదువుకున్నవాళ్లే. ఆకాలంలో ఎవరూ విద్యావిహీనులు లేరు.

అన్న—నే నేమీ చదువుకోలేదు. నాకేం జ్ఞానం తక్కువయింది? వుత్తరం రాసేచదువు చాలు ఆడదానికి.

కమ—దస్కతు చెయ్యగల అక్షరా లొస్తే యెంతప్రయోజనమో వుత్తరం రాసేటం తొచ్చినా అంతే ప్రయోజనం.



అన్న—యేమిరా! మొద్దులా అల్లా చూస్తూ వూరుకుంటా వేం?

నేను—ఊరుకోక యేం జెయ్యను—వాదం సబబుగా ఉన్నప్పుడు?"

అన్న—యేమిటే! సబబుగా వుందీ? యెందుకులే—నీగడ్డి నువ్వు తింటావు. ఆతర్వాత అమ్మ చెప్పింది గదా వినకపోయానని అఘోరిస్తావు. యేడవండి కూర్చుని—నా కెందుకు?

నేను— నా కెందుకని నువ్వూరుకుంటే బతికే పోతాం.

కమ—చీకటి పడిపోతోంది, యెప్పుడువెళ్లటం?

అన్న—నీ కేం మతి పోయిందా యేఁవి టమ్మా యీ—చెబుతూం టేను? ఆకట్టేమి టల్లా వుంది?

కమ—నే నిక్కడి కొచ్చినప్పట్నించీ కడుతున్నకట్టేగా, యిప్పుడు కొత్తే మొచ్చింది?

అన్న— అడుగుదా మనుకుంటూనే వున్నాను. మామూలుగా లేదే?

కమ—దీనిపేరు పారసీకట్టు. దీని కడగా లనుకోవడ మెందుకు?

అన్న—అయ్యో! యిదేం విపరీతమే అమ్మ! నలుగురూ చూస్తే పేర్లెట్టరూ? అసలు కేతరాజువారి కోడలు కచ్చా పోసి కట్టవలసిందే. కాని యిల్లాంటిపిచ్చి వేషా లేస్తే నన్ను పొడిచి చంపెయ్యరూ?

కమ—బాగానే వుందండీ. కట్టుకూ బొట్టుకూ కూడా లా పాసు (pass) చేస్తే అడగక్ఖర్లేదు. మీ కాలంలో ఆకట్టు బాగుంది, మీ రలా కట్టుకున్నారు. నా కది నచ్చక నే నిలా కట్టుకున్నాను. మీరు పేర్లు పెట్టకుండా వుంటే వూళ్లోవా రెవరూ యేమీ అనరు. ఒకవేళ తెలివిహీను లెవరైనా అన్నా మన మంతగా కేర్ (care) చెయ్యనక్కర లేదు.

అన్న—నన్నే లెక్ఖచెయ్యడం లేదు, వూళ్లోవాళ్లను లెక్ఖచేస్తావు నువ్వు? నాకూ ఆబాధంతాను.

కమ—మీరూ చెయ్యకండి.

అన్న—నేనుకూడా వినిపించుకోకపోతే, ఫలానివారి కోడ లిలాంటిదని అపరిదిష్ట రాదూ—నాకు?

కమ—ఏమిటీ? ఇలాంటిదంటే నా కర్థంకావటం లేదు. నాలో యేం తప్పుంది?

అన్న—యింత షోకేమిటి నీకు? యిల్లా వుండడమే తప్పు. యెవరో అనాలా యేమిటి?

కమ—మీరు చూడకపోబట్టి మీ కిది షోకులా కనబడుతూంది. అయినా వుందే ననుకోండి. వీ రనుకుంటారు, వార నుకుంటారు అని వణుకుతూవుంటే యిక సరదా యెలా తీరుతుంది?

అన్న—అందుకోసం యిహ హద్దూ పద్దూ లేకుండా మీరిపోవటమే?

కమ—నే నేమీ మీరలేదు. ప్రతిస్వల్పవిషయానికీ మీరే రాద్ధాంతం చేస్తున్నారు. అయినా తమాషాగానే వుందే! నన్నెంచడమే మీపనిలా కనబడుతూంది. నే నొచ్చి సరిగా నాలుగైదురోజు లైందో లేదో, యీనాలుగురోజుల్నుంచీ దేనికో ఒకదానికి నన్నెత్తిపొడవడమే! నన్నింతవర కెవరూ పేర్లుపెట్టినవారు లేరు. యికమంచి పని కట్టుకుని పెట్టిస్తే చెప్పలేను గాని.

అన్న—అయ్యయ్యో! యి దెక్కడిపిల్లరా బాబూ! నువ్వనిపిస్తున్నావా—యేమిటి? బెల్లంకొట్టిన రాయిలా మాట్లాడ వేమిరా?

నేను—బాగానే వుంది—నన్నేం జెయ్యమంటావు? కట్టుకీ బొట్టుకీ నేనుకూడా కేకలేసి ఫూలు (fool) ననిపించుకోలేదనా—నీవిచారం? ఎవళ్ల కెలా సరదాగా వుంటే అలా వుంటారు. అన్నిటికీ పెద్దవాళ్లు కలగజేసుకోవటమంత ఫూలిష్‌నెస్ (foolishness) మరి లేదు. ఏదైనా తప్పుపని చేస్తే కేకలెయ్యొచ్చు.

అన్న—వీటివెంబడి అవీ వొస్తాయి—యెంతోసేపు పడుతుందా? యిలా వుంటే మహారాజులా పాడవుతారు.

నేను—బుద్ధి మంచిదైతే యెన్నడూ పాడవరు. బుద్ధి వంకరబుద్ధయితే మన మెలా వుంచినా సరిగా వుండరు.

అన్న—ఆ కాటుకలేని కళ్లూ—ఆ పొట్టిచేతుల రవికా—పువ్వులు చుట్టిన జడచుట్టు—బుజాలదాకా వేళ్లాడే ఆ లోలకులూ—కడియాలు లేకుండా కాళ్లకి జోడూ—బాగానే వుం దమ్మాయి వేషం! యివన్నీ మార్చుకోమని చెప్పకుండా చూస్తూ వూరుకోమంటావా?

నేను—కాలాన్ననుసరించి ఫేషన్సు (fashions) మారుతూవుంటాయి. ఎప్పు డెలా వుంటే అలా వుంటారు. దాని కేమంటావు?

అన్న—నే నన్నానా? యిది బాగుందని నేనుకూడా యిల్లా తయారైతే మొహమ్మీద వుమ్మేస్తారు నలుగురూనూ.

నేను—ఉమ్మేస్తారని భయపడుతున్నావా? లేకపోతే నీకూ అభ్యంతరం లేదన్నమాట! నాన్న వున్నట్టు నే నన్నానా? నువ్వన్నట్టు కమలమాత్రం యెలా వుంటుంది? నేను పిలక పెట్టుకుంటే నువ్వేగా క్రాపింగు చేయించుకునేదాకా ప్రాణాలు కొరికేశావు?

అన్న—మొగా డెల్లా వున్నా లోకం హర్షిస్తుంది. ఆడది యిష్టమొచ్చినట్టల్లా వుంటే పెద్దవాళ్ల ప్రాణం వొప్పదు. కళ్లనిండా కాటికా, కచ్చాపోసి చీరా, కాళ్లకి కడియాలూ, మొహన్నిండా పసుపూ, దాని మీద దమ్మిడీఅంత కుంఖంబొట్టూ వుంటేనే గాని కేతరాజువారికోడ లనిపించుకోదు. యీతురకబీబీ అల్లా మారితేనే గాని నే నొప్పుకోను.

కమ—నెత్తిమీద పిలకతోసహా గోష్పాదమంత జుట్టూ, బిళ్లగోచి పోసి బట్టా, వేలికి దర్భముడి ఉంగరమూ, ముఖంమీద వీభూదిరేఖలూ వుంటేనే గాని బ్రాహ్మలే అనిపించుకోరు. మనవాళ్లాస్థితికొస్తే వాళ్లకు తగ్గట్టు మేమూ మారతాము. ఆడవాళ్లూ మొగవాళ్లూ ఒకలాగే పుట్టారు. ఎక్కువతక్కువ లేమీ లేవు. అందుచేత అయినదానికీ కానిదానికీ కలగజేసుకుని 'నువ్విలా వుండాలీ' అని పెద్దవాళ్లు నిరూపించడం బాగుండలేదని నా అభిప్రాయం. నేను మారితేనే గాని ఒప్పుకో నన్నారు గనుక చెప్పవలసొచ్చింది. ప్రతిస్వల్పవిషయానికి మీరు చెబుతూవుండటం, అది వినలేదని ఒకవిధమైన కోపమేర్పడటం—ఇదంతా అనవసరం. చూచీ చూడనట్టు వూరుకుంటే యేపోట్లాటలూ వుండవు. మర్యాద నిలుపుకో

దలచినవారు అలాగే చేస్తారు. నేను మీకంటె చిన్న దాన్నయినా మీకు చెప్పవలసొచ్చింది. మీ రింకో విధంగా అనుకోకండి.

అన్న—చూశావట్రా, చూశావట్రా—యెల్లా చెబుతూందోనూ! యిల్లాంటిదానికి సమాధానం నువ్వేం చెబుతావు, నే నేం చెబుతాను? యిలా వస్తుందనే గా, నేను చదివించొద్దు నాయనా అని యేడిచింది? అప్పుడు నామాట చెవినిపెట్టావా? యిప్పుడాపిల్ల కేంజవాబు చెబుతావో చెప్పు.

నేను—ఎందుకు—జవాబు చెప్పడం?

అన్న—యేమిటే! చెప్పక యిష్టమొచ్చినట్టల్లా వుండనిస్తావా? నీకు మతేమన్నా పోయిందా యేమిట్రా?

నేను—నాకు కాదు పోయింది. ఎల్లా అయితేం పెళ్లి చేసుకున్నాంగదా అని నీతో గలిసి ప్రతిదానికీ పొడుచుకు తినమంటావా? 'నువ్విలాగ వుండాలీ' అని జ్ఞానం వున్న మగవాడెవడూ రూలు పాస్ (pass) చెయ్యడు. నువ్వూ కమలా యేమనుకున్నా సరే, నేను కలుగజేసుకునేవాడను కాను. నాదగ్గి రిలాంటిసంగతు లేమీ చెప్పొద్దు. ఏవస్తువ జూచినా నీకు పోయింది గనుకనా మమకారం—యిక చిన్నవాళ్లకెలా పోతుంది?" అని నే నంటూండగా మానాన్నొచ్చాడు. ఆయన రావటంతోటే కమల లోపలి కెళ్లిపోయింది.

"ఏమి టే గడబిడ?" అన్నాడు మానాన్న.

అన్న—యేమిటా? యీదొరా, దొరసానీ షికారు బయల్దేరారు. నే నిహ వూళ్లో తలెత్తుకొని తిరగ్గలనా? అంచేత నేను వల్లకాదన్నాను. యిద్దరూ నాతో తగూ పెట్టు కూర్చున్నారు. యిదీ జరిగిన సంగతి.

"ఆషది షికారెళ్లట మేమిటి? యింకా నయం! ఆపావు గనక సరిపోయింది. లేకపోతే వూళ్లో నలుగురూ నన్ను పొడిచి చంపేద్దురు. యివ్వాళ నువ్వడ్డంగలబట్టి నా మర్యాద దక్కింది. అయినా ఆడదానికైనా సిగ్గుండాలి, మొగాడికైనా సిగ్గుండాలి అదొకవేళ వస్తా నందే అనుకో, మనవాడి కుండక్కర్లే జ్ఞానం? ఈదద్దమ్మెల్లా సిద్ధమైనాడు, తీసుకెళ్లటానికి?"

అన్న—అబ్బే! వాడి నోట్టిచెవలమ్మని చేసి కూచోపెట్టిం దీనాలుగురోజుల్లోనూను. ఆపి ల్లెంతంటే అంతే అంటున్నాడు. అయిపోయింది వాడిపని.

"ఏమిరా! బండీ కట్టించింది షికారెళ్లటానికేనా? మాట్టాడ వేమిరా?"

"అవును."

"అయితే దాన్నికూడా వెంటేసు కెళుదామనేనా?"

"ఇద్దరం వెళ్లొస్తే తప్పేముంది? వీలుంటే అమ్మకూడా రావచ్చు."

"అయ్యయ్యో! యిం కెక్కడికొంప—తగలడి పోయింది! దిక్కుమాలిన సమ్మంధం—వాళ్లు బ్రాహ్మలవునో కాదో అసలు! ఒకవేళ అయినా, యే బ్రహ్మసమాదిగాళ్లో! మొట్టమొదటినుంచీ అదేడుస్తూంటే



నేను వినిపించుకున్నాను కాను. వినిపించుకోనందుకు రోగం చప్పగా కుదిరింది వెధవకి! ఇంకా నాకు బ్రాహ్మణ్య మేమిటి నా శ్రాద్ధం! మాలపీనుగు లింట్లో కాలు

పెట్టిం తర్వాత బ్రాహ్మణకోం పెళ్లా అవుతుంది? అయ్యబాబ్యా! విశ్శిగాడి సెంత వీథిలో కీడ్చారత్తా! నాఖర్మ మిల్లా కాలింది. మిమ్మ ల్నటనటు మెందుకు! ఇహ చాలు కాని, అబ్బాయీ! వాళ్ల పిల్లని వాళ్లదగ్గఱ దిగబెట్టి రా. మన మందరమూ యేగోదావరిస్నానమో చేసి ప్రాయశ్చిత్తమన్నా యేడుద్దాం. నువ్వెల్లాగా మాలవెధవ్వేనని నేను రూఢిపర్చుకున్నా. సీమ కెళతానని అఘోరిస్తున్నావు గా? నువ్వు తిరిగి బ్రాహ్మణరూపంతో మాకు కనపడేదిలేదు. మేము చూసేదిలేదు. నీదారిని నువ్వెళ్లు. మాతిప్పలు మేం పడతాం. అంతే గాని యీపిల్లని మే మింట్లో పెట్టు కూర్చుంటే నలుగురు బ్రాహ్మలూ వచ్చి చావగొట్టొదిలిపెడతారు. ఆదెబ్బలూ పడలేము,-అస్తమానం ప్రాయశ్చిత్తం తనులడా లేము. మాటిమాటికీ ప్రాయశ్చిత్తం చేయించుకుంటే నాలిక పుండడి చక్కాపోతుంది. అంచేత యీరోజుమట్టుకాపిల్ల కన్నం వీథిలో పెట్టించి రేప్పొద్దునే వాళ్ల వాళ్లదగ్గిర దిగబెట్టి రా. అంతే గాని నలుగురూచూస్తే వెలేస్తారు. సముద్రంమీద ప్రయాణం చేసి నువ్వు బతికొస్తావన్నమాట సర్వాబద్ధం. సెలవ లైపోగానే నువ్వెళ్లి ఆ గంగలో దిగు. యిహ మీజోక్యం మా కక్కర్లేదు——చెబుతున్నాను."

3

మాకు చెన్నపట్నం కాపరం బహు కొత్తగా వుంది. నే నింకా సీమా గీమా చుట్టబెట్టి రావటంచేత నా కాట్టే లెఖ్ఖనిపించడంలేదు; గాని మాఅమ్మకీ నాన్నకీ తలణుచుకున్నట్టుంది. నాకూడా గులకరాళ్ల మీద బండి తోలినట్టు దిక్కుమాలిన అరవభాషతో తలమంటెత్తుకొస్తోంది. కాని యేం జెయ్యనూ! అయిదారేళ్ల వస్థపడి సంపాయించిన బారిష్టరుబల్లని చిన్నవూళ్లో కడితే డిగ్నిటీ (dignity) కి లోప మొస్తుందేమోనని నాకే సందేహం కలిగింది. ప్రాక్టీసున్న ప్లీడర్లలో కెళ్లి, "I am an Advocate" అంటూ బాండ్సూ (bands) గౌన్సూ కట్టుకు తిరుగుతున్న వకీళ్ల కేమాత్రం ప్రాక్టీస్ వస్తూందో మన కూడా అంతకంటె యెక్కువ రాదనుకున్నాను. బారిష్టర్ అని పెద్దపెద్దక్షరాలతో రాసి యెంత రెయిల్వే స్టేషనుకు దగ్గిరిగా కట్టినా ఒకమారు చదవటంతోటే చెల్లు కాని లోపల కాలు పెట్టేవా డెవడూ వుండడని తోచింది. ఇదెల్లా వున్నా చెన్నపట్నంలో ప్రాక్టీస్ పెట్టడానికి ముఖ్యంగా నాస్నేహితుల పట్టేనని చెప్పవచ్చు. నీళ్లు కొత్తచెయ్యటంవల్ల యావన్మందీ శయ్యాగతుల మయ్యాం. ఏమిరియాలరసాలవల్లో అందరం లేచి తిరుగుతున్నాం కాని మా అమ్మమాత్రం మంచాన్నింకా వదిలిపెట్టలేదు. అల్లా మంచంమీద పడుకునికూడా నన్ను రెండోవివాహం త్వరలో చేసుకోమని బాధిస్తూనే వుంది. మాతల్లిదండ్రు లిద్దరూ కలిసి మా అత్తవారిసంగతేమీ తెలియకుండా జేసేశారు. కాని నాకు కమల మీదనే వుంది మనస్సంతాను. కొంత స్థిమితపడ్డతర్వాత వాళ్ల ఇన్ఫర్మేషన్ శ్రద్ధగా కనుక్కుందామని మనస్సులో నిశ్చయపర్చుకున్నా. మా అమ్మకి జ్వరం తగ్గలేదు, పైగా యెక్కువైనట్టు తోచింది. ఇహ డాక్టర్ని రప్పిస్తేనే గాని లాభం లేదని స్నేహితునింటికి కబురంపించాను, డాక్టర్ని పంపించుమని. మానాన్న సంధ్యావందనం చేసుకుంటున్నా డింట్లో. నే నేమో మా అమ్మ దగ్గిరి కొచ్చి యెల్లా వుందని అడిగాను.

అన్న——అంత యెక్కువగా లేదురా. వొళ్లు కూడా అంతవెచ్చగా లేదు. కాని నేను పడిపోయినా, యిల్లుపట్టిన వెధవాడబడు చుంది గనక మనపుచ్చె పూస్తోంది. లేకపోతే మనపాట్లు కనపడును. నే నెన్నిమాట్లు చెప్పినా మావాళ్లపిల్లని చేసుకోమని, వినిపించుకో వేమిరా? యింటికి పట్టిన కోడ లుంటే యీఅమ్మవారిని గుమ్మంలో అడుగుపెట్ట నిద్దునా? యింట్లో కోడలు లేకపోబట్టి అవ స్థల్లాపట్టింది కాని.

"అసలు వా ళ్లెక్కడున్నారో కూడా కనుక్కోందే మనం తొందర పడటం బాగుంటుందిటమ్మా?"

అన్న——అద్ధాన్నం, వాళ్లసంగ తెత్తకు. వున్న వూరొదిలిపెట్టెక్కడికో లేచి పోయారట! వాళ్లు

మనకి కనపడనే కనపడరు. ఒకవేళ కనిపెస్తేమట్టుకు వర్ణ సంకరప్పిల్ల నింట్లో తెచ్చి పెట్టుకుంటావుట్రా?

"వర్ణసంకర మేమిటి?"

అన్న—ఆఁ! యేమిటా? ఆపి ల్లింకా చదువే డుస్తోందిట! ఆలాంటిపిల్లని గుమ్మంలోకి రానిస్తానా? నా ప్రాణం వుండగా!

"ఎక్కడ చదువుతూందో?"


అన్న—ఏట్లో! యెక్కడైతే నేం మనకి? కాని నేను కుదిర్చినపిల్లని చేసుకో.

"ఆతరవాత ఆలోచిద్దాం. కాని యిప్పుడు పెళ్లి మాటెత్తకమ్మా."

అన్న—ఇంకా ఆలోచ నేమిటి,-మావాళ్లపిల్లని చేసుకోక?

"ఆయాసపడకమ్మా" అని నే నంటూవుండగా మా నవుక రొచ్చి డాక్టరుగా రొస్తున్నారని చెప్పాడు. గబగబా కుర్చీ వొకటి మంచందగ్గిరిగా లాగి సావిట్లో కెళ్లాను. కారులోంచి దిగుతూ పెట్టె పట్టుకు నొక సర్వెంటూ, లేడీడాక్టరూ ప్రత్యక్షమయ్యారు. జ్వరం వొచ్చింది ఆడవాళ్లకే కదా అనుకొని మాస్నేహితు డీవిడిని పంపించా డనుకున్నాను. ఆవిడా లోపలి కొచ్చింది. 'గుడ్‌మార్నింగ్' అని కుర్చీ చూపించాను. ఆవి డాశ్చర్యంతో రెప్ప వాల్చకుండా అయిగారు సెకండ్లు చూసింది నావంక.

"మాఅమ్మగారికి ఫీవ రొచ్చింది—లోపలికిరండి, చూద్దురుగాని' అని నే నన్నాను. నవ్వుకుంటూ పెదవులకి జేబురుమా లడ్డంపెట్టుకొని లేచింది. ఆడది నన్నిల్లా చూడట మేమిటి, యీనవ్వట మేమిటని నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఈదేశంలోకూడా ఆడవాళ్లకి బొత్తిగా భయభక్తులు పోయాయే మనుకున్నా. ఇద్దరం రోగిమంచందగ్గిరి కెళ్లాం. ఆవిడ థర్మామెటరు తీసి రోగినోట్లో పెట్టి స్టెతస్కోపుతో లంగ్సుని పరీక్ష ప్రారంభించింది. చూడబోతే యిరవైమూడు యిరవై నాలుగేళ్లకంటె యెక్కు వున్నట్టు కనిపించలేదు. వేసుకున్నదంతా ఖద్దరుడ్రెస్సు. చూడ్డానికి బాగానేవుంది—యేకులమో గాని! చెవలకి లోలకులూ, మెళ్లో వొక



నెక్‌లేసూ, సన్నపాటి గొలుసూమాత్రం వున్నాయి. కాని నన్నావిడల్లా చూడటాని కర్థం మాత్రం యెంతాలోచించినా నాకు బోధపడలేదు. స్త్రీలు అసలే చపలలూ. అందులో చిన్నతనం. అందుచే తల్లా చూచుంటుం దనుకున్నాను. ఎగ్జామినేషన్ పూర్తయింతర్వాత నావైపు తిరిగి,—

డాక్ట—ఫీవ రంత ప్రమాదమైంది కాదు. మరేం భయంలేదు. మీసర్వెం టొస్తే నేను మెడిసిన్ పంపిస్తాను; రెండుపూటల్లో తగ్గిపోతుంది.

"ఆలాగే వెంటనే పంపిస్తాను."

డాక్టరు—ఆహారం రొట్టే పాలూ యివ్వండి. అవసర మైతే రేపు మార్నింగు మళ్లీ వచ్చి చూస్తాను.

నేను మానవుకర్ని పిలిచి డాక్టరుగారివెంట వెళ్లి మందు తీసుకురమ్మని చెప్పాను. ఆవిడిని నిమ్మళంగా కారుదాకా సాగనంపి కారు కదలిందాకా వుండి యింట్లో

కొచ్చాను. ఆమె తల వంచుకుని కారులో కూచున్నా చూపు నామీదే వున్నట్టు నాకు తోచింది. నోటికి రుమా లడ్డంపెట్టుకున్నా బుగ్గలమీది సొట్టలవల్ల చిరునవ్వు నవ్వుతున్నట్టు కూడా తెలుస్తూనేవుంది. కాని ఆనవ్వు చూస్తే నాకు చెడ్డకోప మొచ్చింది. ఆడవా ళ్లందర్నీ గాలు చేస్తే మిడిసిపా టిల్లాగే వుంటుం దనుకున్నాను. ఇల్లాగే అనుకుంటూ కుర్చీలో కూచున్నాను. ఒకఅర గంటలో మందు తీసుకొచ్చాడు మానవుకరు. నే నొకడోసు మాఅమ్మ కిచ్చి సీసా అల్మారులో పెట్టాను. ప్రాక్టీసు లేకపోయినా, కోర్టు కెళ్లడం తప్పదు గనుక భోంచేసి కోర్టు కెళ్లాను. ఆరో జెల్లాగో గడిచిపోయింది. ఆమరచటిరోజుకి ఆవిడిమందువల్లనే తగ్గిందో, తగ్గవలసే తగ్గిందో కాని—మాఅమ్మకి జ్వరం తగ్గింది. ఈసంగతి చీటి వ్రాసి పంపాను. రెండుమూడురోజులకి సరిపొయ్యే మందు పట్టుకొచ్చాడు మానవుకరు. నేను రోజూ లాగే కోర్టు కెళ్లి రెండుగంటల కింటి కొచ్చాను. నే నింటి కొచ్చి డ్రెస్సు మార్చి యీజీఛెయిరులో కూచు న్నాను. కాఫీ తీసుకొచ్చి బల్లమీద పెట్టెళ్లిపో యింది మా మేనత్త. అది పుచ్చుకోబోతున్నా. ఇంతలో లేడీ డాక్టరుగారి సర్వెం టొచ్చాడు. ఇప్పుడు వీ డెందు కొచ్చాడో అనుకున్నా. వాడు కవ రొకటి నాచేతి కిచ్చాడు. నే నది తీసుకుని చింపుతుండగా స్ఫురించింది, బహుశా బి ల్లయుంటుందని. ఇంతతొందరగా బిల్లు పంపించింది—నే నెక్కడికైనా పారిపోతా ననుకుంది కాబోలని నాకు వొళ్లు మండింది! అయినా ఆవిడి నన వలసిన పనేముంది? 'ధనమూల మిదం జగత్' కదా అనుకున్నా. ఇలా అనుకుంటూనే మడత విప్పాను. విప్పీ విప్పటంతోటే నాదృష్టి పై నున్న అచ్చక్షరాల మీద పడ్డది. 'Mrs కే. యస్. కమలా, యమ్. బి., బి. యస్., అసిస్టెంటు సర్జన్, మద్రాస్.'

*     *     *     *     *
*     *     *     *     *
*     *     *     *     *

యస్. కేశరాజ్, బారిస్టరు,
c/o Mrs. కే. యస్. కమలా,
యమ్. బి., బి. యస్., అసిస్టెంటు సర్జన్,
మైలాపూరు, మద్రాస్.

---

# జ్ఞానబుద్ధుఁడు

జి. జాషువకవిగారు

౧

సరవి న్నీకడకంట వెల్గిన యహింసాజ్యోతికిఁ గొండలు
న్గరఁగింపంబడె వెన్నపూసలవలెన్, భూమండలం బెల్ల నీ
చరణాబ్జంబుల ముద్దు గొన్నది మహీశాగ్రామణీ! జ్ఞానభా
స్కర! బుద్ధప్రభు! నీసుధోక్తులకు సంస్తంభించె ముల్లోకముల్.